తెలంగాణ తీర్పు.. కాంగ్రెస్ గెలుపు

- అసెంబ్లీ ఎన్నికల్లో 64 చోట్ల విజయం
- 39 స్థానాల్లో గెలుపొందిన బీఆర్ఎస్
- బీజేపీకి 8, ఎంఐఎంకు 7, సీపీఐకి 1
- పలువురు కాంగ్రెస్ సీనియర్ల ఓటమి
- జాబితాలో జగ్గారెడ్డి, జీవన్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్
- ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపు
- చాలాచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ
- రౌండ్ రౌండ్‌కు మారిన ఫలితం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెం బ్లీ ఎన్నికల్లో 64 సీట్లలో గెలుపొందిన కాంగ్రెస్ అధికారాన్ని కైవసం చేసుకున్నది. కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్... 39 సీట్ల వద్ద ఆగిపోయింది. బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందగా, ఎంఐఎం మళ్లీ 7 స్థానాల్లో విజయం సాధించింది. ఇక కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నా సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకున్నది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ జారీచేసి, నవంబర్ 30న పోలింగ్ నిర్వహించిన విష యం తెలిసిందే. ఓట్ల లెక్కింపు ఆదివారం చేపట్టింది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కాగా ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. అనంతరం సాధారణ ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. రాత్రి 8 గంటల వరకు కూడా పలు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. 2018 ఎన్నికలతో పోల్చితే బీఆర్ఎస్‌కు 49 సీట్లు తగ్గగా కాంగ్రెస్‌కు 45 సీట్లు అధికంగా వచ్చాయి. అదే సమయంలో బీజేపీకి 7 సీట్లు అధికంగా వచ్చాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 88 సీట్లు సాధించగా, కాంగ్రెస్ 19, బీజేపీ ఒక స్థానంలో మాత్రమే విజయం సాధించాయి.

క్షణక్షణం ఉత్కంఠ

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం ఉత్కంఠగా సాగింది. మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు జరగ్గా, మరికొన్ని స్థానాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య పోరు సాగింది. రౌండ్ రౌండ్‌కు ఆధిక్యంలో మార్పు కనిపించింది. కొన్ని రౌండ్లలో ఒక పార్టీకి ఆధిక్యం వస్తే.. మరికొన్ని రౌండ్లలో మరో పార్టీకి మెజార్టీ వచ్చింది. పలు నియోజకవర్గాల్లో మూడు పార్టీల మధ్య విజయం దోబూచులాడింది. ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగిన నియోజకవర్గాల్లో చేవెళ్ల, కరీంనగర్, సూర్యాపేట, మహేశ్వరం, ఆదిలాబాద్, కామారెడ్డి, బాల్కొండ, బోధన్, దేవరకద్ర, గద్వాల, సంగారెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్, మెదక్, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, జుక్కల్, కోరుట్ల, నాంపల్లి, సిర్పూర్, తాండూర్, అలంపూర్ ఉన్నాయి. ఈ స్థానాల్లో గెలిచిన అభ్యర్థులు తక్కువ మెజార్టీతో బయటపడ్డారు. గెలిచినవారికి 5వేల లోపు మాత్రమే మెజార్టీ రావడం గమనార్హం. జుక్కల్‌లో కేవలం 800 ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మీకాంతరావు గెలుపొందారు.

ఆదివారం నాంపల్లిలోని గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల సంబురాలు

కాంగ్రెస్ కీలక నేతల ఓటమి

కాంగ్రెస్‌లో కీలక నేతలుగా పేరున్నవారిలో చాలా మంది విజయం సాధించారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి బ్రదర్స్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి వారంతా విజయం సాధించగా, కొందరు సీనియర్ నేతలు ఓటమిపాలయ్యారు. ఆ జాబితాలో షబ్బీర్ అలీ, పొదెం వీరయ్య, మధుయాష్కీ గౌడ్, జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, ఆర్ దామోదర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్ ఉన్నారు. నిజామాబాద్ నుంచి ఎల్బీనగర్‌కు మారిన మధుయాష్కీగౌడ్ 83,157 ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితమయ్యారు. కామారెడ్డి నుంచి నిజామాబాద్ అర్బన్‌కు మారిన షబ్బీర్ అలీ 15,387 ఓట్ల తేడాతో ఓడిపోయారు. జగ్గారెడ్డి 9,297 ఓట్ల తేడాతో, జీవన్‌రెడ్డి 15,585 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

కొత్త ముఖ్యమంత్రి ఎవరు?

- రేసులో రేవంత్, ఉత్తమ్, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి
- హోటల్‌లో సమావేశం.. హాజరైన డీకే
- రేవంత్‌రెడ్డే సీఎం అంటూ ప్రచారం
- కొట్టిపారేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నేడు సీఎల్పీ భేటీ
- గవర్నర్‌ను కలిసిన ఠాక్రే, డీకే రేవంత్, ఉత్తమ్‌కుమార్ బృందం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి ఎవరు అన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. సీఎం ఎంపికపై కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతున్నది. సీఎం సీటు కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొన్నది. పలువురు సీనియర్ నేతలు ఎప్పటి నుంచో తామూ సీఎం రేసులో ఉన్నామంటూ ప్రకటనలు చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రేసులో ఉన్నట్టు చెప్పుకొన్నారు. దీంతో వీరిలో ఎవరిని ఎంపిక చేయాలన్నదానిపై అధిష్ఠానం చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఆశావహులతో పాటు ఎమ్మెల్యేలతో మాట్లాడిన తర్వాతే సీఎం అభ్యర్థిని ఎంపిక చేయాలని భావిస్తున్నట్టు సమాచారం.

సీఎల్పీ నేత ఎంపికపై కసరత్తు

సీఎం ఎంపికపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సారథ్యంలో పార్టీ కసరత్తును వేగవంతం చేసింది. ముందుగా సీఎల్పీ నేత ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. హైదరాబాద్‌లోని హోటల్ ఎల్లాలో సీఎల్పీ సమావేశం నిర్వహించనున్నది. శనివారం నుంచి ఇక్కడే మకాం వేసిన డీకే శివకుమార్... గెలిచిన ఎమ్మెల్యేలను హోటల్‌కు రావాలని కోరారు. దీంతో రాత్రికే పలువురు ఎమ్మెల్యేలు హోటల్‌కు చేరుకున్నారు. ఈ సమావేశంలో సీఎంగా ఎవర్ని ఎంపిక చేయాలనేదానిపై ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని పార్టీ అధిష్ఠానం తీసుకున్నది. ఈ అభిప్రాయాలకు అనుగుణంగా సోమవారం సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి అధికారికంగా సీఎల్పీ నేతను ఎన్నుకోనున్నది.

రేవంత్ సీఎం.. కొట్టిపారేసిన ఉత్తమ్

రేవంత్‌రెడ్డే సీఎం అంటూ ఇటు పార్టీలో అటు మీడియాలో, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్నది. ఇందుకు అధిష్ఠానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ ప్రచారాన్ని ఆ పార్టీ సీనియర్ నేత, సీఎం రేసులో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటి వరకు సీఎం ఎవరనేదానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఏఐసీసీలో దీనిపై ఎలాంటి నిర్ణయం జరగలేదని తేల్చి చెప్పారు. సోమవారం ఉదయం సీఎల్పీ సమావేశం తర్వాతే స్పష్టత వస్తుందని తెలిపారు. అయితే సీఎం ఎవరనేదానిపై తన అభిప్రాయాన్ని ఇప్పుడే చెప్పలేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకున్న తర్వాతే అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ నేతలు

సంపూర్ణ మెజార్టీ సాధించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఆదివారం రాత్రి ఠాక్రే, డీకే శివకుమార్, ఉత్తమ్, రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరింది. అంతకు ముందు డీకే మీడియాతో మాట్లాడుతూ... సీఎల్పీ నేత ఎంపిక కోసం సోమవారం ఉదయం 9.30కు సీఎల్పీ భేటీ నిర్వహించనున్నట్టు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం లేదా సాయంత్రం సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించేలా పార్టీ కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. తొలుత ఎలాంటి హడావిడి లేకుండా రాజ్‌భవన్‌లోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పార్టీ నిర్ణయించినట్టు సమాచారం.

మంత్రివర్గంలో ఎవరెవరు?

- కొత్త ప్రభుత్వ కూర్పుపై ప్రజల్లో ఆసక్తి
- కుల, వర్గాలకు ప్రాతినిధ్యంపై కసరత్తు
- సీఎం ఆశావహులందరికీ మంత్రివర్గంలో చోటు?
- ఒకరిద్దరికి డిప్యూటీ సీఎంలుగా చోటు కల్పించే అవకాశం?

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించటంతో ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ కూర్పుపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. తెలంగాణ రెండో సీఎం ఎవరు అవుతారు? మంత్రివర్గంలో ఎవరికి చోటు లభిస్తుంది? అనే అంశాలపై జోరుగా ఊహాగానా లు, చర్చలు మొదలయ్యాయి. ఏ జిల్లా నుంచి ఎవరికి మంత్రివర్గంలో అవకాశం లభిస్తుందనే అంచనాల్లో ప్రజలు మునిగితేలుతున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో సీఎం అభ్యర్థులుగా ప్రకటించుకున్న వారందరికీ కొత్త మంత్రి వర్గంలో స్థానం లభిస్తుందనే వాదన బలంగా వినపడుతున్నది. భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులకు మంత్రివర్గంలో చోటు లభిస్తుందని భావిస్తున్నారు. ఖమ్మం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుకు వారి సామాజిక వర్గాల నుంచి అవకాశం దక్కుతుందని తెలుస్తున్నది. మహిళ, ఎస్టీ, బీసీ కోటాల నుంచి ములుగు ఎమ్మెల్యే ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖలకు అవకా శం ఉంటుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతున్నది. బ్రాహ్మణ వర్గం నుంచి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అవకాశం దక్కవచ్చని సమాచారం. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎస్సీ కోటాలో జీ వివేక్ వెంకటస్వామికి కూడా మంత్రివర్గంలో చోటు లభిస్తుందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నిజాబాద్ జిల్లా బోధన్ నుంచి గెలుపొందిన సుదర్శన్‌రెడ్డి, బీసీ కోటాలో పొన్నం ప్రభాకర్‌కు మంత్రివర్గంలో చోటు దక్కుతుందనే చర్చ సాగుతున్నది. సీనియర్లు, విద్యావంతులను స్పీకర్‌గానో, డిప్యూటీ స్పీకర్‌గానో నియమించాల్సి వస్తే.. సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీనితోపాటు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మరొకరికి మంత్రివర్గంలో స్థానం లభించే అవకాశం ఉంటే కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు వెలమ సామాజిక వర్గం నుంచి అవకాశం ఉండవచ్చని భావిస్తున్నారు. ఇక సీఎం అభ్యర్థులుగా ప్రచారం పొందిన వారిలో ఒకరిద్దరికి డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చే అవకాశం ఉన్నదని కూడా కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. సీనియర్ నేత, మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర రాజనర్సింహకు అవకాశం దక్కొచ్చని అంచనా వేస్తున్నారు. బీసీ కోటాను మరింతగా విస్తరించాలని భావిస్తే రజక సామాజిక వర్గానికి చెందిన శంకరయ్య పేరును పరిశీలించే అవకాశం ఉన్నదని చర్చ సాగుతున్నది. హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో (జీహెచ్ఎంసీ) కాంగ్రెస్‌కు తక్కువ సీట్లు వచ్చినా.. సిటీకి ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తే.. ఒకరిద్దరికి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9న సీఎం, మంత్రుల ప్రమాణస్వీకారం ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గతంలోనే పలుమార్లు ప్రకటించిన నేపథ్యంలో ఆ లోపుగానే మంత్రివర్గంలో ఉండేవారి పేర్లను ప్రకటించే అవకాశం ఉన్నది.

రేవంత్ ఇలాకాలో గులాబీ హవా

- మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో కారు స్పీడు
- ఏడు అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకున్న బీఆర్ఎస్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగర పరిధిలో ఎంఐఎం గెలిచిన సీట్లు మినహా మిగిలిన అన్ని స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్.. పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి పార్లమెంటు పరిధిని క్లీన్ స్వీప్ చేసింది. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని మొత్తం ఏడు నియోజకవర్గాలను గులాబీ పార్టీ తన ఖాతాలో వేసుకుంది. ముఖ్యంగా 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల పరంగా కాంగ్రెస్ కంటే వెనుకబడిన బీఆర్ఎస్.. ఈ ఎన్నికల్లో గణనీయంగా ఓటింగు శాతాన్ని పెంచుకొంది. దేశంలోనే అతి పెద్ద పార్లమెంటు నియోజకవర్గం మల్కాజిగిరి. ప్రతిష్ఠాత్మకంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గం కావడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ పార్లమెంటు పరిధిలోకి మల్కాజిగిరి, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్లు వస్తాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఏడు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీనే విజయం సాధించింది. అనంతరం 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో 15,63,646 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా... రేవంత్‌రెడ్డికి 6,03,748 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి 5,92,829 ఓట్లు రావడంతో పదివేల పైచిలుకు ఓట్లతో రేవంత్ గెలిచారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి గణనీయంగా పుంజుకుంది. ఇక్కడి ఏడు స్థానాలను గులాబీ పార్టీ నిలబెట్టుకుంది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ 37.91 శాతం ఓట్లను సాధించగా... తాజా ఎన్నికల్లో 9.01 శాతం అదనపు ఓట్లతో 46.92 శాతం ఓట్లను సాధించింది. కాంగ్రెస్ 2019 పార్లమెంటు ఎన్నికల్లో 38.61 శాతం ఓట్లను సాధిస్తే ఇప్పుడు 29.16 శాతం ఓట్లకు పడిపోయింది. బీజేపీ సైతం గతంతో పోలిస్తే స్వల్పంగా తన ఓట్ల శాతాన్ని పెంచుకున్నది.

అసెంబ్లీకి నలుగురు ఎంపీలు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన నలుగురు ఎంపీలు గెలువగా, ముగ్గురు ఎంపీలు ఓటమిపాలయ్యారు. ఒక బీఆర్ఎస్ ఎంపీ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు గెలిచిన వారిలో ఉండగా, బీజేపీ నుంచి ముగ్గురు తలపడి ముగ్గురూ పరాజయాన్ని చవిచూశారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకలో బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌ను ఓడించారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో విజయం సాధించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లో, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కోరుట్లలో, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు బోథ్‌లో పోటీచేసి ఓడిపోయారు. గతంలో పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించినవారు తాజాగా అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, గతంలో పెద్దపల్లి ఎంపీగా పనిచేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం ఎంపీగా సేవలందించి కొత్తగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. గతంలో పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించి ఈ దఫాలో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో కేసీఆర్ కూడా ఉన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మల్కాజిగిరి ఎంపీగా పనిచేశారు. మునుగోడు నుంచి గెలిచిన రాజగోపాల్‌రెడ్డి గతంలో భువనగిరి ఎంపీగా పనిచేశారు. వరంగల్ ఎంపీగా సేవలందించిన కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.

లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తాం: తమ్మినేని

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. బీజేపీకి ఓట్లు, సీట్లు పెరగడం మతోన్మాద ప్రమాదం రాష్ట్రంలో తగ్గలేదని సూచిస్తున్నాయని అన్నారు. లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం ఒంటరిగా పోటీ చేయడం వల్ల ఓట్లు కొంత చెదిరినట్టు గమనించామని తెలిపారు. ఫలితాలను లోతుగా పరిశీలించి లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. కొత్త ప్రభుత్వం పట్ల ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చెప్పారు. పార్టీకి ఓటేసిన ఓటర్లకు, పార్టీ శ్రేణులకు, ధన్యవాదాలు తెలియజేశారు.

బీఎస్పీ సీఎం అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ ఓటమి

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ సీఎం అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓటమిపాలయ్యారు. సిర్పూర్ నుంచి ఆయన బరిలోకి దిగగా, మూడో స్థానంలో నిలిచారు. అక్కడ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు 2,923 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, 44,151 ఓట్లతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మూడో స్థానం దక్కింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప 60,379 ఓట్లతో రెండోస్థానంలో నిలిచారు. కౌంటింగ్ ప్రారంభమైన తొలి రౌండు నుంచి స్వల్ప ఆధిక్యంతో కొనసాగారు.

విజయానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు

- ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన వారందరికీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్‌కు విజయాన్ని కట్టబెట్టిన ప్రజల తీర్పుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు తెలిపారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి ప్రజలు తమపై మరింత బాధ్యతను పెంచారని అన్నారు. జోడో యాత్ర ద్వారా తెలంగాణలో రాహుల్‌గాంధీ స్ఫూర్తిని నింపారని చెప్పారు. రాహుల్‌గాంధీ అండతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు. ఈ విజయాన్ని తెలంగాణ అమరవీరులకు అంకితమిస్తున్నట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు.

తెలంగాణ ప్రజలకు మోదీ ధన్యవాదాలు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది స్థానాలు గెలుచుకోవడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. తమకు మద్దతు పలికిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. 'కొన్నేండ్లుగా మాకు మీ మద్దతు పెరుగుతున్నది. ఈ సరళి రాబోయే కాలంలోనూ కొనసాగుతుంది. తెలంగాణతో మా బంధం విడదీయరానిది. ప్రజల కోసం మేం పనిచేస్తూనే ఉంటాం. ప్రతి బీజేపీ కార్యకర్త చేసిన అపార కృషిని నేను అభినందిస్తున్నాను' అని మోదీ ట్వీట్ చేశారు.

26 ఏండ్లకే ఎమ్మెల్యేలుగా..

అసెంబ్లీకి వెళ్లే పిన్నలు, పెద్దలు వీరే

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనసభలో ముగ్గురు అతిపిన్నవయస్కులు అడుగుపెట్టనున్నారు. వారిలో అందరి కంటే తక్కువ వయస్సు కలిగిన ఎమ్మెల్యేగా పాలకుర్తి నుంచి గెలుపొందిన మామిడాల యశస్వినిరెడ్డి (26), మెదక్ నుంచి విజయం సాధించిన మైనంపల్లి రోహిత్ (26) రికార్డు సృష్టించారు. ఆ తర్వాతి స్థానాల్లో నారాయణపేట నుంచి గెలుపొందిన డాక్టర్ పర్ణికారెడ్డి (30), కంటోన్మెంట్ నుంచి ఎన్నికైన లాస్యనందిత (36) ఉన్నారు. వీరంతా తొలి ప్రయత్నం లోనే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

సీనియర్లలో పోచారం టాప్

అసెంబ్లీలో అడుగుపెట్టనున్న సీనియర్లలో బాన్సువాడ నుంచి గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి (74), బోధన్ నుంచి విజయం సాధించిన పీ సుదర్శన్‌రెడ్డి (74) అందరికంటే ముందున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో స్టేషన్ ఘన్‌పూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి (71), ఖమ్మం నుంచి ఎన్నికైన తుమ్మల నాగేశ్వరరావు (70), గజ్వేల్ నుంచి గెలిచిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (69), అందోల్ నుంచి విజయం సాధించిన దామోదర్ రాజనర్సింహ (64) ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అభినందనలు: టీజీవో

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీ సాధించిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) అభినందనలు తెలిపింది. నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత పురోభివృద్ధి సాధించాలని టీజీవో అధ్యక్షప్రధాన కార్యదర్శులు వీ మమత, ఏ సత్యనారాయణ ఆకాంక్షించారు. టీజీవో నేతలు సహదేవ్ యాదవ్, రవీందర్‌కుమార్, గండూరి వెంకటేశ్వర్లు, ఎంబీ కృష్ణాయాదవ్, బీ వెంకటయ్య, టీ లక్ష్మణ్‌గౌడ్, కృష్ణమూర్తి తదితరులు నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభావం చూపని బర్రెలక్క

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొల్లాపూర్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన బర్రెలక్క అలియాస్ కర్నె శిరీష అందరి దృష్టి ఆకర్షించింది. నిరుద్యోగ అభ్యర్థుల ప్రతినిధిగా బరిలో నిలిచిన ఆమె పోస్టల్ బ్యాలెట్‌లో ముందంజలో ఉన్నప్పటికీ ఫలితాల్లో మాత్రం ప్రభావం చూపలేదు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కంటే ఎక్కువగా బర్రెలక్క పాపులారిటీ సాధించినా ఓడిపోయింది. బర్రెలక్కకు మొత్తం 5,754 ఓట్లు వచ్చాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలో హేమాహేమీలు బరిలో ఉన్న చోట బర్రెలక్క ఎన్నికల బరిలో నిలవడంతో సోషల్ మీడియాలో మద్దతు లభించింది. శిరీష ఓడిపోయినా సోషల్ మీడియాలో మాత్రం ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ నెటిజన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.